రోడ్డుపైనే చేపల విక్రయాలు



మినీబైపాస్‌రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేసిన చేపల కొనుగోలుదారులు



చేపల కొనుగోలుదారులతో రద్దీగా మారిన మినీబైపాస్‌రోడ్డు.. చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు

- రాకపోకలకు అంతరాయం
- అంటు వ్యాధులు ప్రబలే అవకాశం
- పట్టించుకోని పోలీస్, నగర పాలక సంస్థ అధికారులు

నెల్లూరు(బారకాసు): నగరంలోని మినీబైపాస్ రోడ్డు ఆదివారం వచ్చిందంటే చేపల మార్కెట్‌గా మారుతోంది. గత కొంత కాలంగా చేపలు విక్రయదారులు ప్రతి ఆదివారం మినీబైపాస్‌రోడ్డుపైనే చేపలు, రొయ్యల విక్రయాలు జరుపుతున్నారు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల వారు పెద్ద ఎత్తున వచ్చి చేపలు, రొయ్యలు కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో ప్రతి ఆదివారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు మినీబైపాస్‌రోడ్డుపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మరోవైపు చేపల విక్రయాల తరువాత పరిసర ప్రాంత ప్రజలు, మినీబైపాస్‌లో వెళ్లే ప్రయాణికులు దుర్గంధంతో ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. చేపల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండడంతో అంటువ్యాధులు ప్రబలుతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి నగరంలోని పెద్దబజారు, మైపాడుగేట్, వేణుగోపాల్‌నగర్, శెట్టిగుంటరోడ్డు వద్ద చేపల మార్కెట్లు ఉన్నాయి. వాటిలో చేపలు విక్రయాలు జరుపుతున్నప్పటికీ మరింత మంది చేపలు విక్రయాలు చేసుకునేందుకు తగిన స్థలం లేక మినీబైపాస్‌రోడ్డును ఎంచుకున్నారు. మొదట్లో కొద్ది మంది విక్రయాలు చేస్తుండడం వల్ల పెద్దగా ఇబ్బంది అనిపించలేదు. ప్రస్తుతం మినీ మార్కెట్‌గా మారడంతో సమస్య నెలకొంటోంది. మినీబైపాస్‌లో రోజురోజుకి ట్రాఫిక్ పెరిగిపోతుండడం, మరోవైపు మినీబైపాస్‌కు ఇరువైపులా కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్‌లు వెలుస్తుండడం వలన చేపల విక్రయాలతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. చేపల విక్రయాలతో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి అటు పోలీసులు, ఇటు నగర పాలక సంస్థ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మామూళ్ల మత్తులోనే ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చేపల విక్రయదారులకు ప్రత్యామ్నాయంగా స్థలాన్ని చూపి సమస్యను పరిష్కరించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి నిల్వ



మాగుంటలేఅవుట్‌లో రోడ్డుపై నిల్వ చేసిన ఇసుక, కంకర

నెల్లూరు(బారకాసు): నగర పరిధిలో రోడ్లపై భవన నిర్మాణ సామగ్రిని ఉంచి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే సదరు భవనాల యజమానులపై చర్యలు చేపడుతామని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ హెచ్చరించారు. అయినప్పటికీ కమిషనర్ ఆదేశాలను భవన నిర్మాణదారులు బేఖాతరు చేస్తున్నారు. రోడ్లపైనే ఇసుక, కంకర, ఇతర నిర్మాణ సామగ్రిని ఉంచి నిర్మాణాలు సాగిస్తున్నారు. సదరు భవన నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో వాహనాలు జారిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. నగరంలోని మాగుంటలేఅవుట్‌లో వెంకటేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో ఓ యజమాని తన భవనాన్ని నిర్మించుకునే క్రమంలో రోడ్డుపైనే ఇసుక, బ్లూమెటల్‌ను నిల్వ చేసి ఉంచారు. దీంతో ఆ రోడ్డులో రాకపోకలు సాగించే వీలు లేకుండా పోయింది. కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న భవన నిర్మాణ సామగ్రిని తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు

- ఇద్దరికి గాయాలు



ముత్తుకూరు: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నెల్లూరు నుంచి ముత్తుకూరు వైపు బయల్దేరింది. ఈ క్రమంలో ముత్తుకూరు నుంచి బైక్‌పై నెల్లూరు వైపు బయల్దేరిన మదన్, మురుగన్‌ను లింగాయపాళెం వద్ద బస్సు ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమంగా ఉన్న మదన్‌ను ఆస్పత్రిలో చేర్చుకోలేదని సమాచారం. ఎస్సై విశ్వనాథరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని నెల్లూరు మూడో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి తేజోవతి కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో ఈఓ ఆర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి స్వాగతం పలికారు. అనంతరం పూజలను నిర్వహించారు. శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

జింకలను తప్పించబోయి..

- అదుపుతప్పిన కారు
- వ్యక్తికి గాయాలు



వెంకటాచలం: రోడ్డు దాటుతున్న జింకలను తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఘటన మండలంలోని తిక్కవరప్పాడు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఇస్కపాళేనికి చెందిన వల్లూరు బాబుల్‌రెడ్డి నెల్లూరు నుంచి కారులో గ్రామానికి బయల్దేరారు. ఈ క్రమంలో తిక్కవరప్పాడు సమీపంలో అకస్మాత్తుగా మూడు జింకలు రెప్పపాటులో రోడ్డు దాటడంతో కారు అదుపు తప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఘటనలో కారు అద్దాలు పగలడంతో బాబుల్‌రెడ్డి గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం 108లో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంతమ్మతల్లి ఆరాధన మహోత్సవం రేపు

పొదలకూరు: ఇనుకుర్తిలో గల అవధూత కాంతమ్మతల్లి ఆశ్రమ 25వ ఆరాధన మహోత్సవాన్ని నిర్వహించనున్నామని పీఠాధిపతి నాగసుబ్బారెడ్డిస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇనుకుర్తి, ముదిగేడు, డేగపూడి మీదుగా గ్రామోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని చెప్పారు. అఖండ భజనలను మంగళవారం ఉదయం ఆరు నుంచి నిర్వహించనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

విశేషాలంకారంలో వేణుగోపాలుడు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీసత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ అవతార మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం రాత్రి వేణుగోపాలుడి మూలవిరాట్టుకు విశేష పూజలు నిర్వహించారు. వేణుగోపాలుడు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా రామిరెడ్డిరోజారెడ్డి, కల్యాణి దంపతులు, కుటుంబసభ్యులు వ్యవహరించారు. దేవస్థానం చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, కార్యనిర్వహణాధికారి దాసరి చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ముత్తుకూరురోడ్డు, ఆకుతోటలో ఉన్న లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు భవనంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. రోగులు పెద్ద సంఖ్యలో వైద్యసేవలు పొందారు. విజయవాడ నుంచి వచ్చిన క్లబ్ పూర్వపు గవర్నర్లు గోపినాథ్, దుర్గామల్లేశ్వరరావు పోర్టబుల్ దంత యూనిట్‌ను ప్రారంభించారు. రోగులకు మందులు ఉచితంగా అందచేశారు. క్లబ్ సేవలను కొనియాడారు.

ఉపాధ్యాయులకు సన్మానం

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముందస్తుగా గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు నరసింహమూర్తి, ఎం మాధవి, దేవదాసు, టైలరింగ్ టీచర్ వసుంధర, తదితరులను శాలువాలతో సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మారుతీప్రసాద్, చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏటా గురువులను సెప్టెంబర్ మొదటి ఆదివారం సన్మానిస్తున్నామని తెలిపారు. క్లబ్ తరుపున ప్రతి నెలా మొదటి ఆదివారం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కంటి ఆపరేషన్లు సైతం ఉచితంగా చేయిస్తున్నామన్నారు. గురుపూజోత్సవ వేడుకల్లో లయన్స్‌క్లబ్ మహిళా వింగ్ సేవా ప్రియ అధ్యక్ష, కార్యదర్శులు అనూరాధ, శిరీష, కోశాధికారి యశోద, పూర్వపు జిల్లా గవర్నర్లు అమృతవల్లి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న వక్త

నెల్లూరు (టౌన్): నగరంలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఉన్న యూటీఎఫ్ కార్యాలయంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో 11 విభాగాల్లో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. రామచంద్రారెడ్డి ఆస్పత్రి వైద్యులు ఎస్వీ రమణయ్య పోటీలను ప్రారంభించారు.విజేతలకు జిల్లా మహాసభల్లో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థుల్లోకి తీసుకెళ్లాలని, సాంస్కృతిక రంగం ద్వారా సామాజిక చైతన్యాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేషు, చలపతిశర్మ, కోశాధికారి మురళీధరరావు, సాంస్కృతిక కమిటీ బాధ్యులు పార్వతీశం, గోపినాథ్, విజయకుమార్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పరిరక్షణ నూతన కమిటీ ఎన్నిక



ఎస్సీ వర్గీకరణ పరిరక్షణ నూతన కమిటీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్సీ వర్గీకరణ తరువాతే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని మాదిగ ఐక్యవేదిక నాయకులు గడ్డం శేఖర్, సీమాంధ్ర ఎమ్మార్పీస్ రాష్ట్రాధ్యక్షుడు పందిటి సుబ్బయ్య డిమాండ్ చేశారు. నగరంలోని బాబుజగ్జీవన్‌రామ్ భవన్‌లో మాదిక ఐక్యవేదిక నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. ఎస్సీ వర్గీకరణ పరిరక్షణకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. సుప్రీం తీర్పును అనుసరించి ప్రభుత్వం తక్షణమే వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు మాల మహానాడు నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అందుకే ఎస్సీ వర్గీకరణ పరిరక్షణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చిందన్నారు. అందులో భాగంగానే జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా జేఏసీ గౌరవ సలహాదారులుగా పందింటి సుబ్బయ్య మాదిగ, హనుమంతరావు, కృష్ణయ్య, అంకి మనోజ్‌కుమార్, జిల్లా కన్వీనర్‌గా జనార్దన్‌రావు, కో కన్వీ నర్‌గా కొమ్ముల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, కోశాధికారిగా రత్నం, మహిళా కార్యదర్శిగా సునీత, శోభారాణి, న్యాయసలహాదారులుగా బద్దేపూడి రవీంద్ర, కుడుముల రవికుమార్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులుగా విజయ్‌కుమార్, సహాయకార్యదర్శులుగా సతీష్, రఘు, బద్రిను ఎన్నుకున్నట్లు వివరించారు.

వైభవంగా శ్రీకృష్ణుడి నగరోత్సవం



నెల్లూరు(బృందావనం): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో మైపాడురోడ్డులోని డీజీపీ కల్యాణ మండపం వద్ద వారం రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు శ్రీకృష్ణుడి ప్రతిమను ప్రత్యేక పల్లకిలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించి నగరోత్సవం జరిపారు. కిసాన్‌నగర్, జాకీర్‌హుస్సేన్‌నగర్, సత్యనారాయణపురం, మైపాడుమెయిన్‌రోడ్డు, తదితర ప్రాంతాల్లో నగరోత్సవం సాగింది. నారాయణ విద్యా సంస్థల ఇన్‌చార్జి విజయభాస్కర్‌రెడ్డి, సుధీర్ నాయుడు, ఇందూజ్ఞానవేదిక నగర అధ్యక్షుడు డీ సురమౌళి, సభ్యులు పెంచలనరసయ్య, సుధాకరాచారి, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వేడుకోలు

నెల్లూరుసిటీ: గత నెల 27న ఇద్దరు వ్యక్తులు తన ఇంట్లోకి ప్రవేశించి బంగారం, వెండి నగదును అపహరించారని, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ తనకు న్యాయం జరగలేదని బాధితుడు ఎద్దల రమేష్ తన ఆవేదనను నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం విలేకరుల ఎదుట వ్యక్తం చేశాడు. బాధితుడి కథనం మేరకు వివరాలు..నెల్లూరురూరల్ మండలం ఆమంచర్ల పంచాయతీ పరిధిలోని మట్టెంపాడులో రమేష్, సుబరత్నమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. గత నెల 27న వారు ఇంట్లో లేని సమయంలో ఇద్దరు వ్యక్తులు లోనికి ప్రవేశించి 6 గ్రాముల బంగారు ఉంగరం, రూ.7 వేలు విలువ చేసే రెండు వెండి గొలుసులు, రూ.25 వేల నగదుతో పాటు, ఉడ్‌కట్టర్ మెషీన్‌ను అపహరించారు. నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇప్పటి వరకు తనకు న్యాయం చేయలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై నెల్లూరు రూరల్ సీఐ వేణును వివరణ కోరగా కేసు నమోదు చేసి అనుమానితులను అదుపులో తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు.

వెటరన్ క్రీడాకారిణికి సన్మానం



నెల్లూరు (టౌన్): మాగుంటలేవుట్‌లోని విశ్వసాయి ఎస్సార్కే స్కూల్‌లో వెటరన్ క్రీడాకారిణి లక్ష్మీసుహాసినిని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘ అధ్యక్షురాలు సుభద్రాదేవి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీత మాట్లాడుతూ ఏ వయస్సులోనైనా కఠోర శ్రమ, వ్యాయామం చేయడం ద్వారా విజయాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సందడి అరుణ, తోట సులోచన, కరుణశ్రీ, నాగేశ్వరమ్మ, కృష్ణవేణి, లలితసుందరి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలను వితరణ చేస్తున్న వాకర్స్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డైకాస్‌రోడ్‌లోని వియాని హోమ్‌లోని పేద విద్యార్థులకు నిత్యావసరాలను ఆదివారం పంపిణీ చేశారు. అసోసియేషన్ సెక్రటరీ స్వర్ణ రమేష్ బాబు తల్లి జయలక్ష్మి ద్వితీయ వర్ధంతి సందర్భంగా నిత్యావసరాలను వితరణ చేశారు. అసోసియేషన్ వ్యవస్థాపకులు మేకల నరేంద్రరెడ్డి, సభ్యులు చింతల అమరేంద్రరెడ్డి, బెజవాడ సునీల్, రాఘవేంద్ర, నలుబోలు బలరామయ్య నాయుడు, గోపీనాథ్, పొన్నం రవిచంద్ర, సుబ్బరామిరెడ్డి, స్వర్ణ సురేష్ బాబు, స్వర్ణ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

విడవలూరు: కంటి చూపును అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే తమ లక్ష్యమని మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నేత్ర వైద్యశిబిరాన్ని విడవలూరు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 180 మందికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశామని చెప్పారు. కంటి చూపు సక్రమంగా లేని 30 మందిని గుర్తించామని, నెల్లూరులోని మోడరన్ ఐ ఆస్పత్రిలో వీరికి ఆపరేషన్లను చేయించనున్నామని చెప్పారు. దేవళ్ల గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు



నిరసన తెలుపుతున్న బీటీఏ నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట): ఉద్యోగుల నుంచి ఎటువంటి కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్కే ఎం రియాజ్ డిమాండ్ చేశారు. సీపీఎస్ అమలు రోజు సెప్టెంబరు 1వ తేదీని విద్రోహ దినంగా పాటిస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్లతో నిరసన కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్కే ఎండీ రియాజ్ మాట్లాడుతూ పెన్షన్ అనేది భిక్ష కాదని ఉద్యోగి హక్కు అని సాక్షాత్తు సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలవంతంగా అమలు చేస్తున్న సీపీఎస్ విధానం ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. దాదాపుగా 20 ఏళ్ల పోరాటాల తర్వాత ప్రభుత్వాలు కొంత మేరకు దిగివచ్చి జీపీఎస్, యూపీఎస్ పేర్లతో మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని, ఇవి ఎంత మాత్రం ఉద్యోగులకు ఆమోద యోగ్యం కాదన్నారు. ఉద్యోగుల నుంచి ఎటువంటి కాంట్రిబ్యూషన్ లేనటువంటి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం పిచ్చిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 117 జీఓను వెంటనే రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి ప్రాథమిక విద్యారంగాన్ని కాపాడాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు సీహెచ్‌వీ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయ ప్రగతి సంపాదక వర్గ సభ్యులు జల్ఫీకర్‌ఆలీ, రాష్ట్ర, జిల్లా బాధ్యులు బాలత్రిపుర సుందరి, రాజశేఖర్, కోటేశ్వరరావు, సుంకు వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, కరీంమొహిద్దీన్, జనార్ధన్, రవి, గుప్తా, సుధీర్ బాబు, రఘు, అబ్బూరి శ్రీనివాసులు, రామ్మోహన్‌రెడ్డి, ప్రసాద్ రావు, భార్గవ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

నెల్లూరు (టౌన్): ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేయాలని బీటీఏ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి చిట్టేటి రమేష్ డిమాండ్ చేశారు. నగరంలోని డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బీటీఏ ఆధ్వర్యంలో సీపీఎస్ అమలుకు వ్యతిరేకంగా ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 సెప్టెంబరు 1న సీపీఎస్ విధానం అమల్లోకి వచ్చిందని, దీనిని వ్యతిరేకిస్తూ ఆరోజును విద్రోహ దినంగా పాటిస్తున్నామన్నారు. సీపీఎస్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయులకు భద్రత లేదన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. అనంతరం పీఎఫ్, ఆర్డీఏ, జీపీఎస్, యూపీఎస్ జీఓల పత్రాలను దగ్ధం చేశారు. బీటీఏ రాష్ట్ర వ్యవస్థాపకులు రమణయ్య, కోశాధికారి ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మాసప్రసాద్, రాష్ట్ర నాయకులు మాల్యాద్రి, మనోజ్, బ్రహ్మయ్య, తిరుపతయ్య, రఘు, ఖాజారహంతుల్లా, మల్లికార్జున, మాధవ తదితరులు పాల్గొన్నారు.

విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయ ప్రారంభం



మాట్లాడుతున్న సత్యనాగేశ్వరరావు

నెల్లూరు(బృందావనం): నగరంలోని ట్రంకురోడ్డులో ఉన్న టీవీఎస్ కల్యాణ సదన్‌లో విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. తొలుత విఘ్నేశ్వరుడి చిత్రపటానికి సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిట్టి సత్యనాగేశ్వరరావు, పీ సురేందర్‌రెడ్డి, కోశాధికారి ఏవీఆర్ మోహన్‌రావు తదితరులు పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనాగేశ్వరరావు, సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలోని వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు సింగిల్ విండో విధానంలో అన్ని శాఖల అనుమతులను పొందేందుకు కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యాలయం పనిచేస్తుందని తెలిపారు. సెప్టెంబరు 5లోగా అనుమతుల కోసం మండపాల నిర్వాహకులు వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు కార్యాలయ ఇన్‌చార్జులు వీ హర్షవర్ధన్ 97048 44343, సీ శ్రీనివాస్‌రెడ్డి 94407 54068ను సంప్రదించవచ్చని తెలిపారు. మండపాల ఏర్పాటుకు సంబంధించి నిర్వాహకులకు ఏ చిన్న సమస్య వచ్చినా తమను సంప్రదించాలని సూచించారు. సమితి బాధ్యులు ఎం పెంచలనాయుడు, ఎం ఈశ్వరయ్య, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, కప్పిర శ్రీనివాసులు, శ్రీకాంత్, కేవీ సుబ్రహ్మణ్యం, జీవీడీ ప్రభాకర్, బీఎస్ రంగరాజన్, పేటేటి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సత్యసాయి శతజయంతి ఉత్సవాలు



సాయిలింగేశ్వరుడికి అభిషేకాలు నిర్వహిస్తున్న హరిప్రసాద్ శర్మ

నెల్లూరు(బారకాసు): శ్రీసత్యసాయి సేవా సంస్థలు, ఆంధ్రప్రదేశ్ వేదాధ్యయన విభాగం ఆధ్వర్యంలో నగరంలోని లక్ష్మీపురంలో ఉన్న ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో ఆదివారం సత్యసాయి శత జయంతి ఉత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ పర్యవేక్షణలో వేకువజామున 5గంటలకు నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం సత్యసాయి చిత్రపటాన్ని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతికి, లోక కల్యాణార్థం సాయిలింగేశ్వరుడుని అభిషేకించారు. మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు బాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర వేదాధ్యయన సమన్వయ కర్త హరిప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.